

పోలవరంలో భారీ వర్షం



ప్రజాశక్తి - పోలవరం

మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు చిర్రెత్తించిన వాతావరణం ఆకస్మాత్తుగా మారి చల్లని గాలులు వీచాయి. అనంతరం ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. కురిసిన వర్షానికి పోలవరం మండల కేంద్రంలో బెస్తవీధి, కమ్మరగూడెం, బాపూజీ కాలనీ, కొత్తపేట, నూతనగూడెం, కృష్ణారావుపేట, గూటాల, కొత్త పట్టిసీమ ప్రాంతాల్లో డ్రెయినేజీలు పొంగి వీధులు జలమయమయ్యాయి. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో జనం ఇబ్బంది పడ్డారు.

భవితవ్యం.. భద్రం..!

ఏలూరు జిల్లాలో 83.65 శాతం, పశ్చిమలో 82.60 శాతం పోలింగ్

పలుచోట్ల అర్ధరాత్రి వరకూ సాగిన ఓటింగ్

స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన ఇవిఎంలు

ఏలూరు, భీమవరంల్లో మూడంచెల భద్రతతో గట్టి బందోబస్తు

గెలుపోటములపై ఎవరి లెక్కలు వారివే

గతం కంటే పెరిగిన ఓటింగ్ శాతం

4న ఓట్ల లెక్కింపు



సాయుధ బలగాల పహారాలో స్ట్రాంగ్‌రూమ్‌లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అభ్యర్థుల భవితవ్యం స్ట్రాంగ్‌రూముల్లోకి చేరింది. అన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు పూర్తయ్యాక జూన్ నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. అప్పటి వరకూ ఇవిఎంలు భద్రపరచిన స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి తణుకు, పాలకొల్లు, ఆచంట, నరసాపురం నియోజకవర్గాల ఇవిఎంలను భీమవరం విష్ణు కాలేజీలో, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల ఇవిఎంలను భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీలోనూ భద్రపర్చారు. ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల ఇవిఎంలను సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు ఆయా ప్రాంతాల్లోనే జరగనుంది. సోమవారం జరిగిన ఎన్నికల్లో గతంకంటే పోలింగ్‌శాతం పెరిగింది. యువ ఓటర్లు ఈసారి పెద్దఎత్తున ఓటు వేశారు. జిల్లావ్యాప్తంగా పలు పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి వరకూ ఓటింగ్ జరిగింది. దీంతో ఇవిఎంలను స్ట్రాంగ్‌రూములకు చేర్చేసరికి తెల్లవారుజాము నాలుగు, ఐదు గంటలు అయ్యింది. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరిన ప్రతి ఓటరుతోనూ అర్ధరాత్రి అయినా ఓటు వేయించారు. దీంతో ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో మొత్తంగా 83.65 శాతం పోలింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో 83.55 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో కేవలం 0.10 శాతం ఓటింగ్ పెరిగిందని చెప్పొచ్చు. ఉంగుటూరు నియోజకవర్గంలో అత్యధికంగా 87.76 శాతం ఓటింగ్ జరగ్గా, అత్యల్పంగా ఏలూరు నియోజకవర్గంలో 70.16 శాతం ఓటింగ్ జరిగింది. ఏలూరు నియోజకవర్గం మినహా జిల్లాలోని మిగిలిన ఆరు నియోజకవర్గాల్లోనూ 80 శాతానికిపైగా ఓటింగ్ జరగడం విశేషం. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 14,72,928 మంది ఓటర్లు ఉండగా 12,16,667 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. దీంతో జిల్లా మొత్తంగా 82.60 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా ఉండిలో 86.20 శాతం ఓటింగ్ నమోదవ్వగా, తక్కువగా భీమవరంలో 79.35 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో 81.90 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల ప్రకారం చూస్తే ఓటింగ్‌శాతం 0.70 శాతం తగ్గినట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి వరకూ ఓపిగ్గా నిలబడి పెద్దఎత్తున ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మండుటెండను సైతం లెక్క చేయకుండా జనం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే..

ఎన్నికల ప్రక్రియ ముగియడంతో గెలుపోటములపై అభ్యర్థులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. రెండు జిల్లాల్లోని 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో టిడిపి కూటమి, వైసిపి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ప్రతి నియోజకవర్గంలోనూ నువ్వా నేనా అన్నట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీ పడ్డారు. డబ్బు సైతం పోటీ పడి పంచారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేలు, బహుమతులు సైతం అందజేశారు. ఓటింగ్‌శాతం పెద్దఎత్తున నమోదవడంతో ఎవరికి లాభం చేకూరుతుందనే లెక్కలు కడుతున్నారు. తమ అభ్యర్థికి ఇంత మెజార్టీ వస్తుందని ఒక పార్టీ, కాదు తమ పార్టీ అభ్యర్థికి మెజార్టీ ఎక్కువ వస్తుందని ఇలా గెలుపోటములపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల ఫలితాలు రావడానికి మరో 20 రోజుల గడువు ఉండటంతో గెలుపోటములపైనే ప్రధాన చర్చ నడుస్తోంది. గెలుపోటములతోపాటు మెజార్టీపైనా బెట్టింగుల జోరు సాగుతోంది.

'పశ్చిమ'లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	ఓటింగ్‌శాతం
ఆచంట	1,80,017	1,49,048	82.80
పాలకొల్లు	1,95,057	1,60,489	82.28
నరసాపురం	1,70,448	1,43,825	84.38
భీమవరం	2,53,116	2,00,857	79.35
ఉండి	2,24,725	1,93,722	86.20
తణుకు	2,34,575	1,92,736	82.16
తాడేపల్లిగూడెం	2,14,985	1,75,990	81.86
మొత్తం	14,72,923	12,16,667	82.60

ఏడు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు 7,51,313 మంది ఓటర్లుండగా, ఓటువేసిన వారు 6,14,077 మంది, పురుష ఓటర్లు 7,21,532 మందికి ఓటువేసిన వారు 6,02,543 మంది ఉన్నారు.

ఏలూరు జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటింగ్ ఇలా

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
చింతలపూడి	2,73,069	2,22,608	81.52
దెందులూరు	2,24,013	1,92,901	86.11
ఏలూరు	2,35,345	1,65,132	70.16
కైకలూరు	2,05,604	1,79,536	87.32
నూజివీడు	2,38,981	2,10,155	87.94
పోలవరం	2,53,981	2,18,366	85.98
ఉంగుటూరు	2,06,437	1,81,164	87.76
మొత్తం	16,37,430	13,69,862	83.65

ఓటు వేసిన మహిళా ఓటర్లు 6,93,172 మంది, పురుష ఓటర్లు 6,76,639 మంది ఉండగా ఇతరులు 55 మంది ఉన్నారు.

క్రాస్ ఓటింగ్ కలవరం..!

అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం

బిసి సామాజిక తరగతి ఎక్కువ ఓటింగున్న స్థానాల్లో మరింత ప్రభావం పడే అవకాశం

గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే



ప్రజాశక్తి - భీమవరం

క్రాస్ ఓటింగ్ ప్రచారం అభ్యర్థులను కలవరపాటుకు గురి చేస్తుంది. అభ్యర్థుల గెలుపోటముల అంచనాలను సైతం క్రాస్ ఓటింగ్ తారుమారు చేసిందనే చెప్పొచ్చు. దీంతో అభ్యర్థుల విజయావకాశాలపై ఎవరి ధీమా వారు వ్యక్తం చేస్తున్నా లోలోన గుబులు నెలకొందని తెలుస్తోంది. గతానికి భిన్నంగా అయితే బిసి సామాజిక తరగతి ఎక్కువ ఓటింగ్ ఉన్న స్థానాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండొచ్చనే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, తణుకు నియోజకవర్గాలు ఉన్నాయి. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఉదయమే బారులు తీరినప్పటికీ రాత్రి 11 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ సాగింది. జిల్లావ్యాప్తంగా 82.60 శాతం పోలింగ్ నమోదైంది. ఆచంట నియోజకవర్గంలో 82.80 శాతం, పాలకొల్లులో 82.28 శాతం, నరసాపురంలో 84.38 శాతం, భీమవరంలో 79.35 శాతం, ఉండిలో 86.20 శాతం, తణుకులో 82.16 శాతం, తాడేపల్లిగూడెంలో 81.86 శాతం పోలింగ్ నమోదైంది. ఒక్క భీమవరం నియోజకవర్గం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గంలో పోలింగ్ 80 శాతానికిపైగా నమోదు కావడం విశేషం. అయితే పోలింగ్ అధిక శాతం నమోదు కావడంతో అభ్యర్థుల గెలుపోటములపై ప్రధాన చర్చ సాగుతోంది. ఎవరిని విజయ వరిస్తుంది, ఎవరు పరాజయం పాలవుతారనే దానిపై లెక్కలు కడుతున్నారు. అయితే జిల్లాలో టిడిపి కూటమి బలంగా ఉన్నప్పటికీ ఎంపీ స్థానంపై క్రాస్‌ఓటింగ్ గుబులు వెంటాడుతోంది. నర్సాపురం ఎంపి స్థానంలో వైసిపి అభ్యర్థిగా గూడూరి ఉమాబాల, బిజెపి అభ్యర్థిగా భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ, కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్.నాయుడుతోపాటు మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గడిచిన ఎన్నికల్లో పొత్తులో భాగంగా బిజెపి నుంచి పోటీ చేసిన క్షత్రియ సామాజిక తరగతికి చెందిన సినీనటుడు కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు గెలుపొందారు. అప్పట్లో ప్రధాన పార్టీలు సైతం క్షత్రియ సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులనే బరిలోకి దింపాయి. ఈసారి వైసిపి సరికొత్త వ్యూహానికి తెరలేపి శెట్టిబలిజ సామాజిక తరగతికి చెందిన బిసి అభ్యర్థిని బరిలోకి దింపింది. ఆచంట, పాలకొల్లు, భీమవరం, తణుకు వంటి పలు నియోజకవర్గాల్లో శెట్టిబలిజ ఓటర్లు పెద్దసంఖ్యలో ఉన్నారు. వైసిపి సైతం సంస్థాగతంగా బలంగానే ఉంది. గడిచిన ఎన్నికల్లో ఇక్కడున్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఐదు స్థానాలను వైసిపి గెలుచుకోవడంతోపాటు నరసాపురం ఎంపి స్థానాన్ని సైతం కైవసం చేసుకుంది. దీన్నిబట్టి నరసాపురం లోక్‌సభ స్థానంలో వైసిపి బలంగా ఉంది. దీంతో ఇక్కడ గెలుపోటములపై ప్రధానంగా చర్చ సాగుతోంది. అసెంబ్లీ స్థానంలో నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసుకున్నా ఎంపి ఓటు మాత్రం గూడూరి ఉమాబాలకు వేయాలని శెట్టిబలిజ సామాజిక తరగతిలో విస్తృత ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ అధికంగా జరుగుంటుందనే చర్చ ప్రధానంగా ఉంది. నరసాపురం, ఆచంట, పాలకొల్లు, భీమవరం, తణుకు నియోజకవర్గాల్లో క్రాస్‌ఓటింగ్ జరిగినట్లు స్పష్టంగా తెలుస్తోంది. దీంతోపాటు మహిళలు, వృద్ధుల సైలెంట్ ఓటింగ్ వైసిపికి కలిసొచ్చే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ వ్యతిరేకత ఓటు అసెంబ్లీ స్థానంలో ప్రభావం చూపినా ఎంపీ ఓటు విషయంలో ఆ వ్యతిరేకత కన్పించలేదని చెబుతున్నారు. అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులు పోటాపోటీగా సొమ్ము పంచడం కూడా రెండు ఓట్లలో కూటమికి ఒకటి, వైసిపికి ఒకటి అనే రీతిన క్రాస్ ఓటింగ్ సాగిందనే విశ్లేషణ కూడా తెరపైకి వచ్చింది. ఏదేమైనా క్రాస్‌ఓటింగ్ మాత్రం ఎంపీ అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపుతాయనేది అందరి అంచనా. అయితే ఇది బిజెపికి అనుకూలమా, లేక వైసిపికి అనుకూలమా అనేది ఎవరికి వారు తమకే అంటే తమకే అని ధీమా వ్యక్తం చేస్తుండటం విశేషం. అదే క్రమంలో ఇండియా వేదిక తరపున కాంగ్రెస్ అభ్యర్థిగా కెబిఆర్.నాయుడుకు సైతం అధికంగా ఓట్లు పోలైనట్లు తెలుస్తోంది. బిజెపి వ్యతిరేక ఓటింగ్‌తోపాటు సిపిఎం, సిపిఐ మద్దతుతో గణనీయమైన ఓట్లు సాధించినట్లు సమాచారం. ఇండియా వేదిక అభ్యర్థి ప్రభావం కూడా ఇతర అభ్యర్థుల విజయావకాశాలపై ఉంటుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ క్రమంలో క్రాస్ ఓటింగ్ ఎవరికి లాభం.. ఎవరికి నష్టమో తెలియాలంటే జూన్ నాలుగో తేదీ వరకూ వేచిచూడాల్సిందే.

మూడంచెల భద్రతలో ఇవిఎంలు

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



స్ట్రాంగ్‌రూమ్‌లకు సీళ్లు వేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో ముగిసిందని, ఇవిఎంలను మూడంచెల భద్రత వ్యవస్థ నడుమ భద్రపర్చామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లాలో సోమవారం పోలింగ్ ప్రక్రియ ముగించుకుని ఏలూరులోని సర్ సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీకి చేరుకున్న పోలింగ్ సిబ్బంది స్ట్రాంగ్‌రూమ్‌ల్లో ఇవిఎంలను భద్రపరిచే కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం వరకు జిల్లా కలెక్టర్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్‌కు జిల్లా యంత్రాంగం తీసుకున్న పటిష్టమైన చర్యల కారణంగా పోలింగ్ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులూ పడకుండా సాఫీగా జరిగిందన్నారు. రాత్రి వరకు పోలింగ్ జరిగిందన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల నుండి సిబ్బంది ఇవిఎంలను తీసుకొచ్చి స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపర్చే కార్యక్రమం మంగళవారం ఉదయం వరకు జరిగిందన్నారు. ఇవిఎంలను మూడంచెల భద్రతా ఏర్పాట్ల మధ్య ఉంచామని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్‌లు కేంద్ర పారా మిలటరీ భద్రతా బలగాల పహారాలో ఉంటాయన్నారు. రెండో అంచెలో రాష్ట్ర రిజర్వ్ భద్రతాదళాలు, మూడో అంచెలో స్థానిక పోలీస్ బలగాలు భద్రత అందిస్తాయన్నారు. ఇవిఎంలను పోలింగ్ సిబ్బంది, ఏజెంట్లు, వివిధ రాజకీయ ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరచి, వారి సమక్షంలో స్ట్రాంగ్‌రూములకు సీళ్లు వేసి కేంద్ర భద్రతా బలగాలకు అప్పగించామన్నారు. ఇవిఎంల భద్రతను, స్ట్రాంగ్‌రూమ్‌ల సీళ్లను తాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటానన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు కూడా పరిశీలించొచ్చన్నారు. కార్యక్రమంలో సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్, ఎస్ఎ.రామన్, జిల్లా ఎస్పి డి.మేరీప్రశాంతి, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆశల పల్లకిలో దెందులూరు అభ్యర్థులు

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

మహిళా ఓటర్లే తీర్పే కీలకం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గంలో పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థుల విజయావకాశలపై అంచనాలు ఊపందుకున్నాయి. 20 రోజులుగా నువ్వా నేనా అన్నట్టు సాగిన ప్రచారం.. ఓటింగ్.. దాని ఫలితం ఇప్పుడు అందరిలో ఆసక్తి రేపుతోంది. నియోజకవర్గంలో 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నా టిడిపి, వైసిపి అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ నెలకొంది. సోమవారం జరిగిన పోలింగ్‌లో 85.01 శాతం ఓట్లు నమోదయ్యాయి. మహిళా ఓటర్లు కూడా అధికంగానే పాల్గొన్నారు. ఇది ఎవరికీ లాభిస్తుందో చూడాలి. అభ్యర్థులు మాత్రం తమదే విజయమని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఊరిస్తున్న విజయం..ఊపిరి బిగపట్టిన అభ్యర్థులు

ఏలూరు నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ స్థానాల్లో దెందులూరు ఒకటి. ప్రారంభంలో కొన్ని సంస్థలు చేపట్టిన సర్వేలు, ఒపీనియన్ పోల్స్‌లో వైసిపికి 58 శాతం, టిడిపికి 48 శాతం ఓట్లు పడతాయని అంచనా వేశాయి. ఎస్‌సి ఓట్లు దెందులూరులో 61,016 అంటే మొత్తం ఓట్లలో 27.7 శాతం, ఎస్‌టి ఓటర్లు 2137 అంటే 0.97శాతంగా ఉంది. దెందులూరులో గ్రామీణ ఓటర్లు 2019లో 2,20,274 మంది ఉన్నారు. 2024లో అదికాస్త 2,24,013 ఓట్లకు చేరింది. 2019లో 84.89 శాతం ఓట్లు పోలవ్వగా 2024లో 85.01 ఓట్లు పోలయ్యాయి. అంటే 0.12 మేర ఓట్ల శాతం పెరిగినట్టే. ఓటింగ్‌లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహిళల ఓట్లు ఎటు పడతాయానేదే కీలకంగా మారింది. ఇక పోలింగ్ మందకోడిగా సాగింది. ఓటర్లు మండే ఎండల్లో, తీవ్ర ఉక్కబోతతో అష్టకష్టాలు పడ్డారు. కొంత అసహనానికి గురయ్యారు. మజ్జిగ, తాగునీరు, టెంట్లు వంటి ఏర్పాట్లు అంతంత మాత్రంగానే చేశారు. దీని ప్రభావం కూడా ఎంతోకొంత ఉంటుందని విశ్లేషకులు చెబు తున్నారు.

రూ.కోట్లలో పందేలు

దెందులూరులో ఎన్నికలపై రూ.కోట్లలో పందేలు సాగాయి. రూ.50 వేల నుంచి రూ. కోటి వరకు మధ్యవర్తుల సమక్షంలో పందేలు కాసినట్లు తెలుస్తోంది. అబ్బయ్యచౌదరి గెలుస్తాడని కొందరు, చింతమనేని గెలుస్తాడని కొందరు పందేలు కాశారు. డబ్బులు సమకూర్చుకోవడానికి కొందరు తమ పొలాలను అమ్మేశారు. కొన్నింటిని తాకట్టు పెట్టారు. మధ్యవర్తులకు ఒకటి నుంచి మూడు శాతం మొత్తం ఓట్ల లెక్కింపయ్యాక ఇచ్చేలా ఒప్పందాలు చేసుకున్నారు. వీరి జీవితాలను అభ్యర్థుల గెలుపోటములు ప్రభావితం చూపుతాయనడంలో సందేహంలేదు.

పంపకాల ప్రభావం

నియోజకవర్గంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అన్ని మార్గాలను చక్కగా వాడుకున్నారు. పచ్చనోట్లు, మద్యంతో కొట్టారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉండగా ఒక్కోచోట ఒక్కోరకంగా పంపకాలు జరగటం కూడా కొంత ప్రభావం చూపింది. ఒక్కో చోట ఓటరుకు రూ.వెయ్యి చొప్పున పంచగా, కొన్నిచోట్ల రూ.1500, కొన్ని చోట్ల రూ.2వేలు చొప్పున పంచారు. దీంతో ఓటర్లలో ప్రధాన పార్టీలకు అభ్యర్థులపై విసుగుగా ఉన్నట్లు తెలుస్తోంది.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రభావం

వైసిపి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రధాన అస్త్రలుగా చేసుకుంటే.. టిడిపి నూతన మేనిఫెస్టో, ల్యాండ్ టైటాలింగ్ యాక్ట్‌ని బాగా వాడుకుంది. అయితే మేనిఫెస్టో అంతగా ప్రజల్లోకి చేరలేదనే ఆవేదన కార్యకర్తల్లో కనిపిస్తోంది. అయినా గెలుపు ఖాయమనే ధీమా ప్రధాన, ప్రతిపక్ష అభ్యర్థుల్లో కనిపిస్తుంది. పెదవేగి, దెందులూరు మండలాల్లో టిడిపికి, పెదపాడు, ఏలూరు రూరల్ మండలాల్లో వైసిపికి ఓట్లు పడ్డాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. జూన్ నాలుగో తేదీన ఎవరిది గెలుపనేది తేటతెల్లం కానుంది.

నూజివీడులో వైసిపి వర్సెస్ టిడిపి

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయంటున్న వైసిపి

ఈసారి గెలుపు తమదేనంటున్న టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

ఈ నెల 13వ తేదీ సోమవారం జరిగిన పోలింగ్ అత్యధిక శాతంగా ఉండడంతో నూజివీడు నియోజకవర్గంలో గెలుపుపై ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసిపి అభ్యర్థి మేకా వెంకటప్రతాప్ అప్పారావు, టిడిపి అభ్యర్థి కొలుసు పార్థసారథి ఎవరికి వారు విజయం తమదే అని ధీమాగా ఉన్నారు. వైసిపి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తామని వెంకటప్రతాప్‌అప్పారావు ధీమాగా ఉన్నారు. స్థానిక నేతనైన తనకే పట్టణ ప్రజలు ఓటు వేస్తారని మేకా వెంకటప్రతాప్ అప్పారావు అభిప్రాయపడుతున్నారు. చంద్రబాబు ఆధునిక అభివృద్ధి పరిపాలనకు పట్టాం కట్టాలనే ఉద్దేశంతో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని, గెలుపు తమదే కొలుసు పార్థసారధి ధీమా వ్యక్తం చేస్తున్నారు. నూజివీడు టౌన్ పరిధిలో గత మూడు పర్యాయాలు వైసిపి గెలిచినప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదని, రాష్ట్ర రాజధాని అమరావతికి కూతవేటు దూరంలో ఉన్న ఆగిరిపల్లి మండలం కృష్ణా జిల్లా నుంచి ఏలూరు జిల్లాలోకి మారుస్తున్నప్పుడు స్థానిక ఎంఎల్ఎ కనీసం తమ అభిప్రాయాన్ని శాసనసభలో తెలియపర్చడం, వ్యతిరేకించడం వంటివి చేయలేదని, టిడిపి అభ్యర్థికే ఇవి సానుకూలంగా ఉండే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెప్పుకుంటున్నారు. నూజివీడు రూరల్ మండలమైనా గ్రామీణ ప్రాంతాల్లోని ఓటర్ల వల్ల గతంలో కొన్ని పర్యాయాల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థికి మెజార్టీ వచ్చేది. కాని ఈసారి టిడిపి అభ్యర్థి బిసి నేత కావడంతో పాటు నూజివీడు రూరల్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లోని పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు వైసిపిలో గెలిచి టిడిపిలో చేరారు. దీంతో మెజార్టీ రాకపోయిన వైసిపి మెజార్టీ తగ్గించే అవకాశాలు ఉన్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తన నామినేషన్ ఉప సంహరించుకోకపోతే టిడిపికి నష్టం జరిగే ఉండేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. నూజివీడులో అభ్యర్థుల పోటీ నువ్వా నేనా అన్న రీతిలో ఉంది. ఏది ఏమైనప్పటికీ నూజివీడు నియోజకవర్గ ఓటర్లు ఏ పార్టీకి పట్టాం కట్టారో వేచి చూడాలి.

న్యాయవాదులకు అవగాహనా సదస్సు



మాట్లాడుతున్న రత్నప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఏలూరు బార్‌అసోసియేషన్‌లోని న్యాయవాదులకు వివాద పరిష్కార ప్రత్యామ్నాయం, మధ్యవర్తిత్వం అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ కోర్టుల్లో కేసులు విపరీతంగా పెరిగడంతో వాటి పరిష్కార నిమిత్తం ఇరుపక్షాలకు ఆమోద యోగ్యమైన రాజీ ప్రయత్నం చేసేందుకు, మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలకు సమన్యాయం చేసేందుకు న్యాయవాదులు, న్యాయమూర్తులు ఉమ్మడిగా కృషి చేయాల్సి ఉందని, దీనిపైన పూర్తి అవగాహన కల్పించడం కోసం ఈ సదస్సును నిర్వహించామని తెలిపారు. న్యాయవాదులు, కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకుని రాజీ మార్గం ద్వారా కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు. ఈ సదస్సుకు కానాల రామకృష్ణారావు, టి.సుబ్బారావు, పి.రత్నరాజు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఏలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎన్ఎంఎం.నాగరాజు పాల్గొన్నారు.

టిడిపి కూటమి విజయం ఖాయం

ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఉదయం చినవెంకన్నను దర్శించుకున్నారు. అనంతరం వైష్ణవి ఫంక్షన్ హాలులో విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొని ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తెలిపారన్నారు. తన పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు గెలువబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. గెలిచిన తర్వాత తాను చెప్పిన ప్రతి పనిని పూర్తి చేస్తానన్నారు. గెలుపునకు కారణమైన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు ఇమ్మడి రత్నాజి, సుంకవల్లి బ్రహ్మయ్య, కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు తలసేమియా వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏలూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ విజయవాడ వారిచే తలసేమియా వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెడ్ క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్య నిపుణురాలు, కన్సల్టెంట్ పీడియాట్రిక్ హెమటో ఆంకాలజిస్ట్ డాక్టర్ వీణ అక్కినేని వస్తున్నారని, తల సేమియా స్క్రీనింగ్, హెచ్‌పిఎల్‌సి వంటి రక్త పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు.

నేటి నుంచి తొలి విడత దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మండలంలో తొలి విడత మలాథియాన్ దోమల మందు పిచికారీ పనులు బుధవారం నుంచి ప్రారంభించనున్నట్లు పోలవరం మలేరియా సబ్ యూనిట్ అధికారి బి.నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మలేరియా అధికారి సురేష్ ఆదేశాల మేరకు తొలి విడత మలాథియన్ పిచికారీ పనులు పోలవరం మండలంలో పోలవరం, వింజరం, ఎల్ఎన్‌డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధి గ్రామాల్లో పిచికారీ పనులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు దోమల మందు పిచికారీకి సహకరించి, గ్రామాలు నివాసాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమల ద్వారా వచ్చే అనారోగ్యాల నివారణకు తోడ్పడాలని కోరారు.

టి.నరసాపురంలో 88.52 శాతం పోలింగ్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 88.52 శాతంగా ఎన్నికల పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 46,094 మంది ఓటర్లు ఉండగా 40,803 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 20,304 మంది పురుషులు, 20,499 మంది మహిళలు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 15 గ్రామ పంచాయతీల్లో కలిపి అధికారులు 46 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెంలోని 71వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 94.96 శాతం పోలింగ్ నమోదు కాగా మండలంలోని కేతవరంలో 85వ బూత్‌లో అతి తక్కువగా 77.12 శాతం నమోదైంది. ఉదయం ఇవిఎంలు మొరాయించడంతో కొన్ని చోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం కాగా కొన్ని కేంద్రాల్లో పోలింగ్ ఏడు గంటలకు ప్రారంభమైనప్పటికీ మందకొడిగా సాగింది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగియడంతో ఓటర్లు బారులు తీరి ఉండడంతో క్యూ లైన్లో ఉన్న ఓటర్లకు అధికారులు స్లిప్పులు ఇచ్చి పూర్తయ్యేవరకు ఓటింగ్ ప్రక్రియ కొనసాగించారు. దీంతో మండలంలోని తెల్లం, కేతవరం, బొర్రంపాలెం, బండివారిగూడెం పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 11గంటల వరకు పోలింగ్ జరిగిందని తహశీల్దార్ తెలిపారు.

జీలుగుమిల్లిలో పోలింగ్ శాతం 84.3

జీలుగుమిల్లి :మండలంలో సోమవారం మొత్తం 25,623 ఓటర్లకు 20,833 ఓట్లు పోలైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఆర్‌వి.వెంకటేశ్వరావు బుధవారం తెలిపారు. మండలవ్యాప్తంగా 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఆయా పోలింగ్ బూత్‌ల ద్వారా మహిళలు 11,214 మంది, పురుషులు 9,618 మంది ఇతరులు ఒకరు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. మొత్తంగా 84.3 ఓటింగ్ శాతం నమోదైనట్లు ఆయన తెలిపారు.

కామవరపుకోటలో 81.32 శాతం

కామవరపుకోట :మండలంలో మొత్తం 81.32 శాతం పోలింగ్ నమోదైంది. 51,100 మంది ఓటర్లకు 41,556 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎండ తీవ్రత అంతగా లేకపోవడంతో కొంత మేర పోలింగ్ శాతం పెరగడానికి దోహదపడింది. యువత ఎంతో ఉత్సాహంగా మొదటిసారి ఓటు వేయడానికి పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. మండలంలోని 49 బూత్‌లలో ఉదయం పోలింగ్ ప్రారంభమయ్యే ముందు నుంచే ఓటర్లు క్యూ లైన్లలో ఉన్నారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసే సరికి ఇంకా వందలాది మంది ఓటు వేయడానికి ఆయా బూత్‌లలో క్యూ లైన్లలో నిలబడి ఉన్నారు. ఒక్క అంకాలంపాడు పంచాయతీలోని బూత్‌లలో మినహా మిగిలిన అన్ని బూత్‌లలో రాత్రి పది లోపు పోలింగ్ ముగిసింది. అంకాలంపాడులో రాత్రి సుమారు 2.30 గంటల వరకు పోలింగ్ జరిగింది. గంటల తరబడి క్యూ లైన్లలో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. అక్కడక్కడ చెదురుమదురు, స్వల్ప వివాదాలు తప్ప మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

అత్యధికం 95.92 శాతం

ఉంగుటూరు : ఉంగుటూరు నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్‌లో రామచంద్రపురంలో అత్యధికంగా 95.92 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ 613 మంది ఓటర్లు ఉండగా 588 మంది ఓట్లు వేశారు. గణపవరంలో 870 మంది ఓటర్లకు 663 మంది ఓట్లు వేశారు. దీంతో అత్యల్పం 76.21 శాతం పోలింగ్ నమోదైందని ఆర్ఒ తెలిపారు.

బాధితులకు కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

దెందులూరు నియోజకవర్గం కొప్పులవారిగూడెంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద జరిగిన ఘర్షణలో గాయపడి ఏలూరు ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైసిపి నాయకులను ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్య చౌదరి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో ప్రజలంతా ఏకపక్షంగా వైసిపికి మద్దతు తెలియజేయడంతో టిడిపి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ తమ అనుచరులతో, గూండాలతో ఈ విధంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొప్పులవారి గూడెం సర్పంచి కుమారుడు చలపాటి రవిపై విచక్షణారహితంగా టిడిపి కార్యకర్తలు దాడి చేశారన్నారు. బాధితులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

తేనెటీగల దాడిలో గాయపడిన ఉపాధి కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తేనెటీగల దాడిలో గాయపడిన ఉపాధి కూలీలను ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుక్కునూరు మండలం దామచర్ల గ్రామంలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రాంతంలో తేనెటీగలు దాడి చేసి సుమారు 20 మంది కూలీలను కుట్టడంతో వారు ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. తేనెటీగల దాడిలో గాయపడిన కూలీలకు ప్రభుత్వమే ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించి బాధితులకు వైద్య ఖర్చులు ఇవ్వాలని, కూలీలకు పని అదనంగా కల్పించాలని కోరారు. పని ప్రదేశాల్లో మెడికల్ కిట్స్ లేకపోవడంతో ప్రాథమిక చికిత్స అందక కూలీలు నానా అవస్థలు పడ్డారన్నారు. కూలీలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సెల్వరాజ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి - కామవరపుకోట

సిపిఐ సీనియర్ నేత తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నం నియోజకవర్గ ఎంపీ ఎం.సెల్వరాజ్ మృతికి సిపిఐ కామవరపుకోట మండల కార్యదర్శి టిడిఎస్.రాజు ప్రగాఢ సంతాపం తెలిపారు. 1989 నుంచి 1996, 1998, 2019తో సహా నాలుగు సార్లు పార్లమెంటు సభ్యునిగా ఆయన ఎన్నికయ్యారన్నారు. సెల్వరాజ్ అనారోగ్యంతో మృతి చెందారన్నారు. ఆయన మృతికి ఎపి ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షులు సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ఎఐటియుసి ఏలూరు జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్ష, కార్యదర్శులు కరేటి నరసింహులు జి.సత్యనారాయణ, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు చలమాల శ్రీనివాసరావు, యామంద్ర స్వామిదాసు, టి.రాములమ్మ, ఏనుగుల దుర్గారావు, బొడ్డు సిద్ధు సంతాపం తెలిపారు.

నేరాలు - ఘోరాలు



చెరువులో పాడిగేదెల మృతదేహాలు

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు, రెండు దూడలు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

యర్రమిల్లిపాడులో విద్యుత్ తీగ తెగి పడిన సంఘటనలో రెండు గేదెలు, రెండు దూడలు విద్యుదాఘాతంతో మృతి చెందాయి. పంచాయతీకి చెందిన తాగునీటి సరఫరాకు సంబంధించి విద్యుత్ లైన్ స్థానిక ఊర చెరువు మీదుగా వెళ్లింది. విద్యుత్ స్తంభంపై శ్లాగిల్ తుప్పుపట్టి తీగ తెగి చెరువు గట్టు చెట్టు మీద పడి తీగ కొన కిందికి వేలాడుతూ ఉంది. ఆ గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణకు చెందిన రెండు గేదెలు, ఒక పెయ్యి దూడ, ఒక లేగ దూడలు చెరువులోకి దిగాయి. చెట్టుపై నుంచి కిందకి వేలాడుతున్న విద్యుత్ తీగ గేదె కొమ్ముకు తగిలి ఆ గేదె చెరువులోకి వెళ్లగానే విద్యుదాఘాతంలో నాలుగు జంతువులు మృతి చెందాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని గొల్లగూడెం విద్యుత్ శాఖ ఎఇ తెలిపారు. పాడిరైతుకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది.

పోలవరంలో హోరాహోరీ

వైసిపి వర్సెస్ జనసేన

ప్రజాశక్తి - టి.నరసాపురం

పోలవరం నియోజకవర్గంలో గెలుపు ఫలితాల కోసం ఎవరికి వారు ఉత్కంఠతగా ఎదురు చూస్తున్నారు. ఎంఎల్ఎ అభ్యర్థులు గెలుపోటములపై లెక్కలేసుకుంటూ కుస్తీ పడుతున్నారు. అభ్యర్థుల గెలుపు అంత ఈజీ కాకపోవచ్చని వైసిపి, జనసేన మధ్య గెలుపు హోరాహోరీగా ఉంటుందని పలువురు చెప్పుకుంటున్నారు. పోలవరం నియోజకవర్గంలో ఏడు మండలాలు కలుపుకుని మొత్తం 2,53,900 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ లో 84.16 శాతం ఓటింగ్ నమోదైంది. అధిక శాతం మహిళలు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు ఉత్సాహం చూపారు. 12 మంది ఎంఎల్ఎ అభ్యర్థులు పోలవరం నియోజకవర్గంలో పోటీదారులుగా ఉండగా ప్రధాన పోటీ మాత్రం వైసిపి అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి, జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు మధ్య సాగినట్లు తెలుస్తోంది. వారిద్దరి గెలుపోటములపై వారు ధీమా వ్యక్తం చేస్తుండగా పోటీ మాత్రం నువ్వా నేనా అన్నట్లుగా ఉండబోతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నియోజకవర్గంలో నమోదైన పోలింగ్‌లో అధిక శాతం మహిళలు ఓటుహక్కు వినియోగించుకోవడం వల్ల గత ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలకు మహిళలు మద్దతు తెపారని, మహిళలంతా తమకే ఓటు వేశారని, అందుకే విజయం తమదేనని వైసిపి నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అయితే నాలుగు సార్లు ఎంఎల్ఎగా పని చేసిన తెల్లం బాలరాజు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, అందుకే వారిపై ఉన్న వ్యతిరేకత ఓట్లు తమకే పడ్డాయని కూటమి బలంతో విజయం ఖాయమని జనసేన నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

అయితే గెలుపోటములపై ఓటుకు నోటు పంపిణీ ప్రభావం కూడా ఉండే అవకాశం ఉంది. నియోజకవర్గంలో వైసిపి అన్ని ప్రాంతాల్లో రూ.వెయ్యి పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. కాగా జనసేన నగదు పంపిణీ విషయంలో ఓటుకు రూ.వెయ్యి పంపిణీ చేసినా పూర్తిస్థాయిలో పంపకాలు చేయలేకపోయిందని చెప్పుకుంటున్నారు. టిడిపి ఎంపీ అభ్యర్థి నగదు పూర్తిస్థాయిలో సర్దుబాటు చేయకపోవడంతో జనసేన అభ్యర్థికి నగదు సర్దుబాటు కాక పోలవరం, కుక్కునూరు, బుట్టాయగూడెం మండలాల్లోని గిరిజన ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నగదు పంపకాలు చేయలేకపోయారని సమాచారం. దీంతో ఆయా ప్రాంతాల ఓటర్లు నగదు ఇచ్చిన వారికే ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఇలా జరిగితే జనసేన గెలుపుపై ప్రభావం పడే అవకాశం ఉంది. అంతే కాక టిడిపి నేతల సహకారం కొరవడిందని, కొన్ని పోలవరం, కొయ్యలగూడెం, టి.నరసాపురం, జీలుగుమిల్లి తదితర మండలాల్లో టిడిపి నాయకులు కేవలం ఎంపీకి ఓట్లు వేయించి ఎంఎల్ఎ అభ్యర్థికి ఓట్లు అడగకపోవడం వల్ల కూడా క్రాస్ ఓటింగ్ జరిగిందని, కొందరు టిడిపి ఓటింగ్ జనసేనకు కాకుండా టిడిపి రెబల్ అభ్యర్థి మొడియం సూర్యచంద్రరావుకు వేశారని చెప్పుకుంటున్నారు. నియోజకవర్గంలో జనసేనకు బుట్టాయగూడెంలో తప్ప పూర్తి స్థాయిలో పార్టీ క్యాడర్ లేకపోవడంతో టిడిపిపై ఆధారపడాల్సి వచ్చింది. ఒకవేళ టిడిపి ఓటింగ్ క్రాసింగ్ జరిగితే వైసిపికి కలిసొస్తోందని కూటమికి ఓటమి తప్పదని విస్తృతంగా ప్రచారం నడుస్తోంది. కాగా ఎలాగైనా కూటమిని గెలిపించుకోవాలని ఓటర్లు భావించారని, ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకత ఉందని, అందుకే ఓటర్లు కూటమికే మద్దతుగా నిలిచారని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగుల ఓట్లు కూడా అధిక శాతం కూటమికి పడ్డాయని ఇక ఈసారి పోలవరంలో జనసేనదే విజయంటూ కూటమి నేతలు చెప్పుకుంటున్నారు. అయితే గెలుపోటములు తుది ఫలితాల్లో తేటతెల్లం కానున్నాయి. ఎవరు గెలిచినా ఎక్కువ మెజారిటీ ఉండకపోవచ్చని తెలుస్తోంది. చివరికి పోలవరంలో గెలుపు వైసిపిదా జనసేనదా అంటే ఫలతాల వరకు వేచి చూడాల్సిందే.

ఉంగుటూరులో ఉత్కంఠ పోరు

నువ్వా నేనా అన్నట్లు వైసిపి, జనసేన మధ్య పోటీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈ నెల 3న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపు ఎవరనేది ఇవిఎంల్లో ఓటర్లు నిక్షిప్తం చేశారు. జూన్ నాలుగో తేదీన వాటి ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే గెలుపు తమదంటే తమదేనంటూ ఇరుపక్షాలు వారి వారి పోల్ మేనేజ్‌మెంట్ అంచనాల్లో తలమునకలై ఉన్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలో 2,06,437 మంది ఓటర్లుకు 1,81,156 (87.75 శాతం) మంది తమ ఓటు హక్కును వినియోగింకున్నారు. ఏలూరు జిల్లాలో ఇదే అత్యధికం. 2019 ఎన్నికల్లో 2,00,216 ఓట్లకు 1,73,840 ఓట్లు పోలయ్యాయి. (80.12 శాతం) గతం కంటే భిన్నంగా ఈసారి దాదాపు ఏడు శాతం ఓట్లు పెరిగాయి. అంటే 2024 నాటికి పెరిగిన కొత్త ఓటర్లతో కలుపుకుని 7,316 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఇలా అదనంగా పోలింగ్ అయిన ఓట్లు తమకే అనుకూలంగా ఉంటాయని ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, జనసేన నాయకులు లెక్కలు వేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఎన్ఆర్ఐలు, ప్రభుత్వ, ఇతర ఉద్యోగులు, యువత, నిరుద్యోగులు, బలమైనా సామాజిక వర్గం ఓటర్లు తమవైపే ఉన్నారని కూటమి నాయకులు ఆశాభావంలో ఉన్నారు. బిసిలు, ఎస్‌సిలు, బడుగు, బలహీన వర్గాలు, పెన్షనర్లు, పథకాలు అందుకున్నవారు తమవైపే ఉన్నారని అధికార పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఓటుకు నోటు ఇతర పంపకాలు, పోల్ మేనేజ్‌మెంట్ నిర్వహణ దానిపై కూడా ఆయా అభ్యర్థులు విజయావకాశాలను బేరీజు వేసుకుంటున్నారు. బూత్‌ల వారీగా పోలయిన ఓట్లను బట్టి కూడా ఏ పార్టీకి అనుకూలంగా మారనుందో అంచానాలతో తలమునకైఉన్నారు. ఓటేసేందుకు గుంపులు గుంపులుగా జాతరను తలపించేలా ఓటరు చైతన్యం ప్రస్ఫుష్టంగా కనిపించడం పార్టీ నేతల్లో ఒకింత సంతోషం, మరో పక్క టెన్షన్ పుట్టింస్తోందని అనడంలో సందేహం లేదు. కాపు బలమైన సామాజిక తరగతి ఓటర్లు సగం మంది జనసేన వైపు వెళ్లినా, గత మెజార్టీ దృష్ట్యా ఎలాగైనా తామే గెలుస్తామని వైసిపి నాయకులు, వార్ వన్‌సైడ్ తమ వైపు ఉందని జనసేన నాయకులు బెట్టింగులు కాస్తున్నారు.

కైకలూరులో ఓటర్ కేక

రికార్డ్ స్థాయిలో 87 శాతానికి పైగా పోలింగ్

మళ్లీ గెలుపు తమదే అంటున్న వైసిపి

ఈ సారి విజయం తమదే అంటున్న టిడిపి కూటమి

ప్రజాశక్తి - కైకలూరు

ఓటర్లు పోటెత్తారు. రికార్డు స్థాయిలో తమ ఓటును నమోదు చేసుకున్నారు. ఎన్నడూ లేని విధంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉంటున్న కైకలూరు ప్రాంత ఓటర్లు చైతన్యం కలిగి ఓటు వేసేందుకు కైకలూరు తరలివచ్చారు. దీంతో గ్రామాలు కళకళలాడాయి. ఏ పోలింగ్ బూత్ చూసినా పండుగ వాతావరణం కనిపించింది. 13వ తేదీ సోమవారం జరిగిన పోలింగ్ రికార్డ్ స్థాయిలో నమోదై రాష్ట్ర ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది. 87.50 శాతానికి పైగా పోలింగ్ పూర్తయింది. ముఖ్యంగా మహిళా ఓటర్లు, యువకులు పెద్ద ఎత్తున తమ అభిమాన నేతకు ఓట్లు వేసేందుకు క్యూ కట్టారు. దీంతో వైసిపి, బిజెపి ఎంఎల్ఎ అభ్యర్థులు ఎవరికీ వారు తాము గెలుస్తామని ధీమ వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ సరళిపై నాయకులు, కార్యకర్తలు, ప్రధాన నేతలతో వారివారి నివాసాలు కిటకిటలాడాయి. ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల వారీగా తమకు వచ్చే ఓట్లను సమీకరించుకుంటున్నారు. 1952 నుంచి ఇప్పటివరకు 16 సార్లు జరిగిన ఎన్నికల్లో ఇంతటి రికార్డు స్థాయి ఓట్ల నమోదు జరగలేదు. తాజాగా జరిగిన పోలింగ్ అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనుంది. ప్రభుత్వ వ్యతిరేఖ ఓటే ఇంతటి ప్రభావం చేకూర్చుందని టిడిపి కూటమి నేతలు అనుకుంటున్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన అభివృద్ధే ఓటర్లలో ఇంతటి మార్పునకు కారణమని వైసిపి శ్రేణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నామినేషన్ మొదలు నేటి వరకు జరిగిన పరిణామాలను పరిశీలిస్తే 16 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసి ఎన్నికల బరిలో ఉన్నారు. ఇండియా వేదిక బలపర్చిన కాంగ్రెస్ పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి బొడ్డు నోబుల్ మూడో స్థానంలో నిలిచినట్లు నేతలు విశ్లేషిస్తున్నారు. నోబుల్ ఓటుకు నోటు ఇవ్వకపోవడమే కారణమఅంటున్నారు. ముఖ్యంగా వైసిపి, బిజెపికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఓటర్లను ప్రలోభాలకు గురి చేశారు. ఓటుకు నోటు ఇచ్చారు. ఓటుకు రూ.రెండు వేల చొప్పున పంపిణీ చేశారు. ఓటర్లు 13వ తేదీ వేకువజాము నుంచే ఓట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద పడిగాపులు కాసి ఓటు నమోదు చేసుకున్నారు. నేతల విజయం, మెజార్టీలపై రూ.కోట్లు పందేలు జరిగాయి. చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ట్రైనీ కలెక్టర్ శ్రీ పూజ, ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కర్, ఆయా విభాగాల అధికారులు, తహశీల్దార్లు కృషి చేశారు. పోలీసులు భారీగా బందోబస్తును చేశారు. మొత్తానికి ఓటర్లు తమ అభిమాన నేతపై అభిమానాన్ని ఇవిఎంలలో నిక్షిప్తం చేశారు. ఫలితాల కోసం నాయకులే కాకుండా ఓటర్లు కూడా ఎదురుచూసే పరిస్థితి కైకలూరు ప్రాంతంలో నెలకొంది.

ఎంఎల్ఎ అభ్యర్థులు నాకు సహకరించలేదు

డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు

డిసిసి పదవిలో ఉన్న వ్యక్తి ఒత్తిడి తెచ్చారు

కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

తనకు ఎంఎల్ఎ అభ్యర్థులు సహకరించలేదని, పైగా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని కాంగ్రెస్ ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య చెప్పారు. డిసిసి పదవిలో ఉన్న వ్యక్తి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారన్నారు. తనకు నూజివీడు, ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థులు మాత్రమే సహకరించారని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఆమెకు ఎదురైన ఇబ్బందుల గురించి తెలియజేస్తూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఆమె గొంతును ప్రజల వరకు చేరవేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో చాలా కష్టపడ్డామని చెప్పారు. తాను ఎన్ఆర్ఐ అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ తనకు అవకాశం కల్పించిందని సంతోషం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల నాకు, పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ మూడు సార్లు ఏలూరు పార్లమెంట్‌లో పర్యటించిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షమైన వైసిపి, టిడిపి వారు కచ్చితంగా గెలుస్తామని చెప్పలేకపోతున్నారంటే తాము గట్టి పోటీ ఇచ్చామని అర్థమైందన్నారు. ప్రెస్‌మీట్ పెట్టడానికి ముఖ్య కారణం కాంగ్రెస్ పార్టీలో ఒక వ్యక్తి ఉన్నత స్థానంలో ఉండి, డిసిసిబి పదవిలో ఉండి తనను డబ్బులు ఇవ్వమని ఒత్తిడి తెచ్చారని, కనీసం కాంగ్రెస్ కార్యకర్తలను ప్రచారానికి రానివ్వని పరిస్థితి నెలకొందని వాపోయారు. అధిష్టానం దీనిని అర్థం చేసుకోవాలని, ఇలాంటి వారిని కాంగ్రెస్ నుంచి తీసివేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. జిల్లా అధ్యక్షులు పదవిలో ఉన్న ఒక వ్యక్తి వారి ఇంట్లోనే వేరే వ్యక్తిని ఇండిపెండెంట్‌గా పోటీ చేయించి వేరే పార్టీ వాళ్ల దగ్గర డబ్బులు తీసుకున్న పరిస్థితులు ఏలూరులో ఏర్పడ్డాయన్నారు. డిసిసిబి పదవిలో ఉన్న వ్యక్తి రూ.మూడు కోట్ల వరకు ఇవ్వాలని తనను డిమాండ్ చేశారని, అవి ఇవ్వకపోతే ప్రచారానికి సహకరించబోమని చెప్పారని తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పదవిలో ఉన్న వ్యక్తి వేరే పార్టీలకు సపోర్ట్‌గా ఉన్నారంటే కాంగ్రెస్ పరిస్థితి ఏంటన్నారు. కాంగ్రెస్ పార్టీ టిక్కెట్ ప్రటించడంతో తాను ఎంఎల్ఎ అభ్యర్థులందరిని రమ్మని పిలిస్తే, వచ్చి తనను రూ.పది కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. చింతలపూడి ఎంఎల్ఎ అభ్యర్థి ఎలిజా కనీసం ఎంపీ అభ్యర్థి ఫొటో కూడా పెట్టుకోకుండా ప్రచారం చేశారన్నారు. చింతలపూడి కార్యాలయంలో తన ఫొటో కూడా లేదన్నారు. బూత్ ఏజెంట్లను పెట్టడానికి కనీసం రూ.12 లక్షలు ఇవ్వాలని ఎంఎల్ఎ అభ్యర్థులు కొంత మంది డిమాండ్ చేశారని, తన వద్ద ఆధారాలు ఉన్నాయని చెప్పారు. ఏలూరు, నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థులు తనకు ఎంతో సహకరించారని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ విషయాలు మాట్లాడినందుకు పార్టీ హై కమాండ్ తనపై ఎటువంటి చర్య తీసుకున్న భయపడేది లేదన్నారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఏలూరు జిల్లాలో ఉన్న నాయకులు డిసిసిబి ప్రెసిడెంట్, జిల్లా జనరల్ సెక్రటరీ ఇద్దరు కలిసి తనని బెదిరించారని, వారిని ఎవరు ఏం చేయలేరన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎదగాలంటే ఇలాంటి నాయకులను ప్రోత్సహించకూడదని పార్టీ నుంచి డిస్మిస్ చేయాలన్నారు.

హెచ్ఎంకు సత్కారం

ప్రజాశక్తి - పోలవరం

ఏజెన్సీ ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభించి, ఎంతోమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఘనత సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కి దక్కుతుందని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ అన్నారు. పదో తరగతి పరీక్షల్లో సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించిన సందర్భంగా మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ టీనా కురియకోస్‌ను ఘనంగా సన్మానించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం సొబ్బన మోహన్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు కూడా స్కూల్ ఫీజులు అందుబాటులో ఉండే విధంగా పెట్టి ఇంగ్లీషు మీడియంలో బోధించడం అభినందనీయన్నారు. ఈ పాఠశాల ఇంకా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈర్నాల జాన్‌కృష్ణ, బొల్లంపల్లి యెషయ్య, కవల సురేష్, కుంజం నాగార్జున, కొండే యేసు, బొద్దుల రాజేష్ పాల్గొన్నారు.

బాధితులకు టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ పరిధిలోని దెందులూరు, ఏలూరు నియోజకవర్గలలో ఉన్న పోణంగి, శ్రీపర్రు, కొవ్వలి ప్రాంతాల్లో సోమవారం పోలింగ్ బూత్ వద్ద వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య జరిగిన దాడి ఘటనల్లో గాయపడి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్తలను టిడిపి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ పరామర్శించారు. అనంతరం పుట్టా మహేష్ మీడియాతో మాట్లాడుతూ ఓటమి భయంతోనే వైసిపి కార్యకర్తలు టిడిపి కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారన్నారు. 20 రోజుల తర్వాత టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, దాడి చేసిన ప్రతిఒక్కరీపై లిగల్‌గా యాక్షన్స్ తీసుకుంటామని చెప్పారు. గాయపడిన వారు ధైర్యంగా ఉండాలని, వారికి ఎప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. గాయపడిన బాధితులకు రూ.పది వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. బాధితులకు అండగా ఉంటామని ఆయన చెప్పారు.

బడేటి చంటి, గన్ని వీరాంజనేయులు పరామర్శ

ఏలూరు నియోజకవర్గ పరిధిలోని పోణంగి గ్రామంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద జరిగిన ఘర్షణలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న టిడిపి కార్యకర్త వేమూరి నాగరాజును టిడిపి ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థి బడేటి చంటి, జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మీడియాతో మాట్లాడుతూ వేమూరి నాగరాజుపై దాడి కేసులో నగరానికి చెందిన కార్పొరేటర్, పోణంగి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఉన్నారని, వీరిపై టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని బడేటి చంటి హెచ్చరించారు.

చింతమనేని ప్రభాకర్ పరామర్శ

దెందులూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సోమవారం పోలింగ్ బూత్ వద్ద జరిగిన దాడిలో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలగూడేనికి చెందిన నాగఫణీంద్ర(19), శ్రీపరుకు చెందిన ఘంటసాల శ్రీహరి(50)లను చింతమనేని ప్రభాకర్ మంగళవారం పరామర్శించారు. అనంతరం చింతమనేని ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం ఓటమి భయంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో విచక్షణారహితమైన దాడులకు పాల్పడిందన్నారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తుందన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ఇటువంటి సంఘటనలకు పాల్పడిన వైసిపి కార్యకర్తలపై ఎంఎల్ఎపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

ప్రకటన

మహారాజశ్రీ భీమవరం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), భీమవరం వారి కోర్టులో

E.P. No. 18/2023 in O.S. No. 218/2021

Beetween:

D.Hr/ Plaintiffs:

1) Manella Nageswara Rao
2) Manella Sowdamani

Vs

J.Drs/ Defendants:

1) Kotrada Peddiraju
2) R.C.M. Church, Peda-Amiram, rep. by its Pastor, Joy Abraham, R/o. Christian peta, 4th Ward, Peda-Amiram, Kalla Mandal, W.G.Dist.,

పై E.P. గ్రంధమునందు 2వ J.Dr వారు శ్రీ కోర్టు వారి ద్వారా ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికి నోటీసులను తీసుకొనని కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము **ది. 21-06-2024 సం॥ తేదీన ఉదయం 10.30 గంటలకు** స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలియపర్చుకొన వలెను. అట్లు కాని ఎడల మీ పరోక్షమందు శ్రీ కోర్టు వారు తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియపర్చడమైనది.

(By Order)

కూనపరాజు గోపాలకృష్ణంరాజు
అడ్వకేట్, భీమవరం

'రానున్నది టిడిపి కూటమి ప్రభుత్వమే'

కామవరపుకోట :వైసిపి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఓటర్లు పోలింగ్‌లోనే చెప్పేశారని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ అన్నారు. పాతూరులోని ఆయన నివాసంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ అరాచకాలు, దౌర్జన్యంపై విసిగిపోయిన ఓటర్లు అర్ధరాత్రి వరకు బారులు తీరి మరీ వైసిపి ఓడించేందుకు కసితో ఓట్లేశారన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, నరసాపురం

O.S. No. 138/2019

Between:

విజయా బ్యాంక్ ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం, దాని చీఫ్ మేనేజర్ ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్నారు **-వాది**

మరియు

1. బత్తుల కిషోర్
2. మాదేటి నరసింహస్వామి **-ప్రతివాదులు**

ప్రతివాదులుకు సమన్లు

డి-1) బత్తుల కిషోర్, S/o. గణేశ్వరరావు, డో.నెం. 1-1-27, బద్ధవానిపేట, పాలకొల్లు-534260.

డి-2) మాదేటి నరసింహస్వామి, S/o. రామాంజనుయ్య దాస్, డో.నెం. 4-18, యాళ్లవాని గరువు.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేసేందుకు పై దావా మీపై దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తర్వాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి. అవి తిరిగి వచ్చాయి. అప్పుడు గౌరవనీయ న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిందని మీకు తెలియజేయడానికి ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి మీరు వ్యక్తిగతంగా లేదా మీ న్యాయవాది ద్వారా **17-05-2024 ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరు కావాలి. మీకు వ్యతిరేకంగా దాఖలైన దావాలో మీ వివరణ ఇవ్వండి. మీరు పైన పేర్కొన్న విచాణ తేదీలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే పై దావాపై మీకు ఆసక్తి లేదని భావించి విచారణ జరిపి తీర్పు వెలువరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
నరసాపురం నరసాపురం-534275
ది.09-05-2024 సెల్:9866259514

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు-కమ్-ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్, నరసాపురం

O.S. No. 126/2019

Between:

విజయా బ్యాంక్ ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం, దాని చీఫ్ మేనేజర్ ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్నారు **-వాది**

మరియు

డి-1) కట్టా వెంకన్న
డి-2) తెన్నేటి రామ్‌బాబు **-ప్రతివాదులు**

ప్రతివాదులుకు సమన్లు

డి-1) కట్టా వెంకన్న, S/o. సత్యనారాయణ, డో.నెం. 21-2-25, బంగారు వారి చెరువు, పాలకొల్లు - 534260, పశ్చిమగోదావరి జిల్లా.

వాదికి చెల్లించాల్సిన రుణ మొత్తాన్ని వడ్డీతో సహా వసూలు చేయడానికి ప్రతివాదులు మీపై పై దావా దాఖలు చేయబడింది. దావా దాఖలు చేసిన తర్వాత కోర్టు ద్వారా మరియు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా మీకు సమన్లు పంపబడ్డాయి. దావాలోని 2వ ప్రతివాది కోర్టుకు హాజరై తన లిఖితపూర్వక సమాధానాన్ని దావాలో దాఖలు చేసారు. దావాలో మొదటి ప్రతివాది సమన్లు అందజేయబడలేదు. ఆపై గౌరవనీయమైన న్యాయస్థానం వాది దాఖలు చేసిన దావా గురించి సమన్లు జారీ చేయబడిన ఈ దావాలో మొదటి ప్రతివాదిని ఈ పేపర్‌లో ప్రచురించాలని ఆదేశాలు జారీ చేసింది. కాబట్టి ఈ దావాలోని మొదటి ప్రతివాది వ్యక్తిగతంగా లేదా మీ న్యాయవాది ద్వారా హాజరు కావలసి ఉంటుంది. మీకు వ్యతిరేకంగా దాఖలైన దావాలో మీ వివరణ ఇవ్వడానికి **17-05-2024 ఉదయం 10.30 గంటలకు** కోర్టుకు హాజరు కావాలి. మీరు పైన పేర్కొన్న విచారణ తేదీలో కోర్టుకు హాజరు కావడంలో విఫలమైతే పై దావాపై మీకు ఆసక్తి లేదని భావించి, విచారణ జరిపి తీర్పు వెలవరిస్తారు.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
నరసాపురం నరసాపురం-534275
ది.09-05-2024 సెల్:9866259514

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్), భీమవరం, ప॥గో॥జిల్లా వారి కోర్టులో

I.A. No. 1484/2023 in O.S. No. 94/2022

Between:

శ్రీమతి ఉద్దరాజు సీతారత్నం, వగైరాలు ***-పిటీషనర్లు/ వాదులు***

V/s

గాదిరాజు కన్యాకుమారి మరియు వగైరాలు ***-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు***

5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది:

కూనపరాజు కౌశిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది మైనర్ అయినందున వీరి తరపున సంరక్షకురాలు తల్లి, 4వ రెస్పాండెంటు/ 4వ ప్రతివాది శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి.

6వ రెస్పాండెంటు/ 6వ ప్రతివాది:

కూనపరాజు కార్తిక్ వర్మ, S/o. లేటు శ్రీనివాసరాజు, C/o. ఆంజనేయ స్వీట్స్, కలగంపూడి, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా, 6వ రెస్పాండెంటు/ 6వ ప్రతివాది మైనర్ అయినందున వీరి తరపున సంరక్షకురాలు తల్లి, 4వ రెస్పాండెంటు/ 4వ ప్రతివాది శ్రీమతి కూనపరాజు నాగ స్వాతి.

పై నెంబరు పిటిషనులో 5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ రెస్పాండెంటు/ 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్లకు అనేక పర్యాయములు శ్రీయుత కోర్టు వారి ద్వారాను మరియు రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను అందుకొనక కాలయాపన చేయుచున్నారని, దానిపై శ్రీయుత కోర్టు వారు పేపరు ప్రకటనకు అనుమతి మంజూరు చేసియున్నారు. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం **ది. 02-07-2024వ తేదీకి వాయిదా అయి వున్నది.** కావున 5వ రెస్పాండెంటు/ 5వ ప్రతివాది అయిన కూనపరాజు కౌశిక్ వర్మ మరియు 6వ రెస్పాండెంటు/ 6వ ప్రతివాది అయిన కూనపరాజు కార్తిక్ వర్మ గార్ల పరోక్షమున తీర్మానింపబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

అల్లూరి వెంకటేశ్వరరాజు
పిటీషనర్లు/ వాదులు తరపు అడ్వకేట్
ప్రాంతం: భీమవరం అడ్వకేట్, భీమవరం
తేది: 12-05-2024 సెల్: 9848211102